కరెంట్-తీగలపై కాకి లెక్క..!

మొదటిపేజీ తరువాయి...

వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు ఉత్పత్తి చేసేవారి నుంచి కరెంటు కొంటం. అందుకు ఒప్పందం చేసుకుంటం. కానీ అట్లా కొన్న కరెంటు తెలంగాణకు రావాలి కదా, రావాలంటే అందుకు విడిగా ట్రాన్స్‌మిషన్ చార్జీలు చెల్లించడం తప్పనిసరి.

పీజీసీఐఎల్‌కే వీలింగ్ చార్జీలు

షాపులో మనం ఫ్రిజ్ కొంటం. ఫ్రిజ్ రేటు షాపులో చెల్లిస్తం. దాన్ని ఇంటికి చేర్చాలంటే ఆటోకో, ట్రాలీకో కిరాయి చెల్లిస్తం కదా! అలాగన్నమాట. ఘనత వహించిన రేవంత్ ప్రభుత్వానికి ఈ సంగతి కూడా తెలిసినట్టు లేదు. ఈ దేశంలో విద్యుత్తు ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణం, నిర్వహణ చూసేది ఒక్కే ఒక్క సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్). ఏ రాష్ట్రం ఎక్కడ కరెంటు కొనుక్కున్నా, దాన్ని తమ ప్రాంతానికి తెచ్చుకోవాలంటే మాత్రం పీజీసీఐఎల్‌పై ఆధారపడాల్సిందే. ఆ సేవలు అందించినందుకు అది వీలింగ్ చార్జీని వసూలు చేస్తుంది. ఇది సాధారణ విద్యుత్తు రంగ నిపుణుడికి కూడా తెలిసిన కామన్ విషయం. మరి పదేండ్ల కిందట తీవ్ర విద్యుత్తు సంక్షోభంలో చిక్కుకున్న తెలంగాణను, దాన్నుంచి బయటపడేయడానికి, అత్యవసర సమయంలో చవక ధరకు ఛత్తీస్‌గఢ్‌లో విద్యుత్తు కొన్న కేసీఆర్ ప్రభుత్వం, దాన్ని తెలంగాణకు తెచ్చుకోవాలా? వద్దా? తెచ్చుకోవాలంటే పీజీసీఐఎల్‌కు ఎవరైనా వీలింగ్ చార్జీలు కట్టాల్సిందే కదా!

మరి కాంగ్రెస్ చేస్తున్నదేంటి?

నాడు ఛత్తీస్‌గఢ్ నుంచి కేసీఆర్ ప్రభుత్వం రూ.3.90కే యూనిట్ కరెంటు కొన్నది. వార్ధా- డిచ్‌పల్లి లైను సత్వరమే పూర్తయ్యేలా పీజీసీఐఎల్‌కు సహకరించి, డెడికేటెడ్ కారిడార్ బుక్ చేసుకుని, ఆ కరెంటును తెలంగాణకు తెచ్చి, రాష్ట్ర ప్రజలను కరెంటు కష్టాల నుంచి బయటపడేసింది. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రంలో అన్ని రంగాలకు 24 గంటల కరెంటు అంది, కోతలు, కొరతల నుంచి రాష్ట్రం బయటపడిన సంగతిని ప్రజలింకా మరిచిపోలేదు. లీకులో ఆరోపించినట్టు ఒకవేళ ట్రాన్స్‌మిషన్ చార్జీల్లో ఏవైనా అక్రమాలు జరిగాయా అనుకుంటే, పీసీజీఐల్ అనేది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ. డెడికేటెడ్ కారిడార్ విషయంలోగానీ, ఓపెన్ మార్కెట్ సరఫరా సమయంలో వీలింగ్ చార్జీల విషయంలో అది ఏం చెప్తే అదే ఫైనల్! అంతెందుకు? కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓపెన్ మార్కెట్‌లో, పీక్ అవర్స్‌లో, ఒక యూనిట్‌కు రూ.8 నుంచి 12 దాకా, నాన్ పీక్ అవర్స్‌లో రూ.5-6 దాకా పెట్టి కరెంటు కొంటున్నది. (కేసీఆర్ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ నుంచి కొన్నది యూనిట్‌కు రూ.3.90కే). ఈ ఎండ కాలంలోనే ఇట్లా దాదాపు వేల మిలియన్ యూనిట్ల కరెంటు కొన్నది. తెలంగాణ ప్రభుత్వం వివిధ విద్యుదుత్పత్తి సంస్థల నుంచి కొంటున్న కరెంటును తెలంగాణకు తెచ్చుకోవడానికి ఏటా దాదాపు 2300 కోట్ల రూపాయలను ట్రాన్స్‌మిషన్ (వీలింగ్) చార్జీల రూపంలో పీజీసీఐఎల్‌కు చెల్లిస్తున్నదని విద్యుత్తు నిపుణులు చెబుతున్నారు. మరి కేసీఆర్ ప్రభుత్వం ట్రాన్స్‌మిషన్ చార్జీలు చెల్లించడం తప్పైతే, కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చెల్లిస్తున్నట్టు? అయినా విద్యుత్తు కొనుగోలు రేటు వేరు, ట్రాన్స్ మిషన్ చార్జీ వేరు, కరెంటు కావాలంటే రెండూ ఉండాల్సిందే, ట్రాన్స్‌మిషన్ చార్జీ చెల్లించకుండా కరెంటు తెచ్చుకోవడం అసంభవం అనే కనీస అవగాహన లేకుండా లీకులిస్తే ఎట్లా అని విద్యుత్తు రంగ నిపుణులు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లాజిక్ ప్రకారం వాళ్లు చెల్లిస్తున్న ట్రాన్స్‌మిషన్ చార్జీలను, వాళ్లు కొంటున్న విద్యుత్తు రేటుకు కలిపి యూనిట్ ధర చూపిస్తే గుండె పగిలే లెక్క తేలుతుందని వారు హెచ్చరిస్తున్నారు. వీలింగ్ చార్జీలు కూడా డిమాండ్‌ను బట్టి మారుతుంటాయని, లైన్ మీద ఉండే ఒత్తిడిని, అందుబాటును బేస్ చేసుకుని పీజీసీఐఎల్ ఎప్పటికప్పుడు వీలింగ్ చార్జీలను ఖరారు చేస్తుందని వారు గుర్తుచేస్తున్నారు.

కేసీఆర్ ముందుచూపుతోనే కష్టాలకు చెక్

''ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం ముందుచూపుతో పీజీసీఐఎల్‌కు లైన్ నిర్మాణంలో సహకరించి ముందస్తుగా డెడికేటెడ్ కారిడార్ బుక్ చేసుకోవడం వల్ల వీలింగ్ చార్జీలు పరిమితంగా ఉన్నాయి. ముందు జాగ్రత్తతో కారిడార్ బుక్ చేయకుండా ఓపెన్ మార్కెట్ ట్రాన్స్‌మిషన్‌కే గనక వెళ్లుంటే పరిస్థితి దారుణంగా ఉండేది. నాడు కేసీఆర్ ప్రభుత్వం మరొక అద్భుతమైన చర్య తీసుకుంది. ఛత్తీస్‌గఢ్‌తో సంప్రదింపులు జరిపి స్టేట్ (రాష్ట్రం లోపల) ట్రాన్స్‌మిషన్ చార్జీల నుంచి మినహాయింపు తీసుకుంది. అంతర్రాష్ట్ర (ఇంటర్ స్టేట్) ట్రాన్స్‌మిషన్‌కు మాత్రమే పీజీఐఎల్‌కు చెల్లింపులు జరిపింది. దీనివల్ల కూడా తెలంగాణపై కొంత భారం తగ్గింది. ఇప్పటి ప్రభుత్వానికి ఇవేవీ అర్థమవుతున్నట్టు లేవు'' అని విద్యుత్తు రంగంలో తలపండిన నిపుణుడు ఒకరు వివరించారు. 'ఛత్తీస్‌గఢ్ నుంచి అరకొరగానే సరఫరా అయింది. ఎన్నడూ వెయ్యి మెగావాట్లు సాఫీగా రాలేదు. అక్కడి నుంచి ఆశించిన సరఫరా తగ్గిపోవటంతో తెలంగాణ డిస్కంలు బహిరంగ మార్కెట్లో విద్యుత్తు కొనుగోలు చేయాల్సి వచ్చింది' అని లీకులో మరో వాక్యాన్ని వండివార్చారు. నిజం ఏమిటంటే 2014లో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కేసీఆర్ ప్రభుత్వం అన్ని రంగాలకు 24 గంటల కరెంటు ఇవ్వడం మొదలుపెట్టింది. దీంతో రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఒక్కసారిగా పుంజుకున్నాయి. విద్యుత్తు వినియోగం బాగా పెరిగింది.

మూర్ఖపు వాదన

''కరెంటులో ఉన్న విచిత్రం ఏమిటంటే దీన్ని నిల్వ చేసుకోలేం. సరఫరా కూడా కన్సిస్టెంట్‌గా ఉండదు. సీజన్లు, అవసరాలు, వాతావరణ పరిస్థితులను బట్టి ఒకసారి పెరుగుతుంది. ఒకసారి తగ్గుతుంది. ఎంత ఫర్మ్ పవర్ ఉన్న రాష్ట్రమైనా, ఎన్ని ఒప్పందాలు చేసుకున్నా ఎంతో కొంత వరకు ఓపెన్ మార్కెట్‌పై ఆధారపడక తప్పదు. నాడు తీవ్ర విద్యుత్తు సంక్షోభంలో ఉన్న తెలంగాణ ఒక్కసారి 24 గంటలు పొందడం వివిధ రంగాల్లో వాడకం క్రమేపీ పెరుగుతూ వచ్చింది. అందువల్ల ఓపెన్ మార్కెట్‌లో కొనడం అనివార్యం. అంతెందుకు? కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణ స్థాపిత విద్యుత్తును మూడు రెట్లు పెంచిన తర్వాత, ఇప్పుడు కూడా మనం ఓపెన్ మార్కెట్‌లో కొనక తప్పడం లేదు. ఇదీ వాస్తవం కాగా ఓపెన్ మార్కెట్‌లో కొనడం తప్పైనట్టు, దానివల్ల భారం పడ్డట్టు వాదించడం మూర్ఖత్వం. భారం గురించి ఆలోచించేవారు 24 గంటల కరెంటు వల్ల మారిన జీవన నాణ్యత గురించి, పెరిగిన సాగుభూమి గురించి, పెరిగిన పారిశ్రామిక ఉత్పత్తి గురించి, అధికమైన వ్యవసాయ దిగుబడుల గురించి, రికార్డు సృష్టించిన ఐటీ ఎగుమతుల గురించి, ఉపాధి అవకాశాల గురించి ఎందుకు మాట్లాడడం లేదు'' అని మరో నిపుణుడు ప్రశ్నించారు.

అభినందించాల్సింది పోయి.. బురద జల్లుడా?

తెలంగాణ విద్యుత్తు సంక్షోభంలో కూరుకుపోవడానికి దాదాపు 60 ఏండ్లు ఉమ్మడి ఏపీని పరిపాలించిన కాంగ్రెస్సే కారణమని, చివరికి కేసీఆర్ అన్ని ఏర్పాట్లూ చేసి ఇచ్చి చూపించిన 24 గంటల కరెంటు ఇప్పుడు కూడా కాంగ్రెస్ ఇవ్వలేకపోతున్నదని, దాన్నుంచి తప్పించుకునేందుకే ఈ బురదజల్లే ప్రయత్నమని ఆయన విశ్లేషించారు. ''ప్రాణంమీదికి వచ్చినప్పుడు డబ్బుల గురించి ఆలోచిస్తామా? లేక ప్రాణం నిలబెట్టుకోవడం గురించా? ఆనాడు కరెంటు విషయంలో తెలంగాణ పరిస్థితి ఇలాంటిదే. అయినా కేసీఆర్ ప్రభుత్వం అటు ఛత్తీస్‌గఢ్‌తోనూ, ఇటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలతోనూ మాత్రమే ఒప్పందాలు చేసుకుని ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా, అధిక రేట్ల భారం పడకుండా జాగ్రత్త పడింది. అందుకు అందరూ దాన్ని అభినందించాలి'' అని ప్రభుత్వ రంగ సంస్థల నిపుణుడొకరు పేర్కొన్నారు. ''ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును తెచ్చుకునేందుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (పీజీసీఐఎల్) తో 1000 మెగావాట్ల విద్యుత్తు సరఫరాకు కారిడార్ బుక్ చేసుకోవాల్సి వచ్చింది. ఈ కారిడార్ కూడా విద్యుత్తు సంస్థల కొంప ముంచింది. బుకింగ్ ఒప్పందం ప్రకారం విద్యుత్తు తెచ్చుకున్నా తెచ్చుకోకపోయినా పీజీసీఐఎల్ కు సరఫరా ఛార్జీలు కట్టాల్సిందే. ఈ లెక్కన వాడకున్నా కట్టిన అదనపు ఛార్జీలు రూ.638 కోట్లు'' అనే వాదననూ ఆయన తోసిపుచ్చారు. ఛత్తీస్‌గఢ్ రెండు వేల మెగావాట్ల కరెంటు ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తం చేసింది. వెయ్యి మెగావాట్లుకు పీపీఏ చేసుకుంది. ఆనాడు తెలంగాణ ఉన్న సంక్షోభ పరిస్థితిలో, ఎక్కడా కరెంటు దొరకని కరువులో పీపీఏ జరిగిన వెయ్యి మెగావాట్ల కన్నా తక్కువకు ఎలా కారిడార్ బుక్ చేస్తామని ఆయన ప్రశ్నించారు. మరో వెయ్యి మెగావాట్ల కారిడార్ బుకింగ్- రద్దుతో ఖజానాపై ఎలాంటి భారం పడలేదని ఆయన వివరించారు.

ఈఆర్సీ ఆమోదంతోనే విద్యుత్తు కొనుగోలు

న్యాయప్రాధికార సంస్థ (క్వాసీ జ్యుడీషియల్) అయిన ఈఆర్సీ తీర్పులపై విచారణ జరిపే అధికారం కమిషన్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి లేదని, కమిషన్ చెల్లదని కేసీఆర్ తన లేఖలో కుండబద్ధలు కొట్టారు. దీంతో కమిషన్ చైర్మన్, ప్రభుత్వ పెద్దల పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. దీని నుంచి తప్పించుకోవడానికి తమవాదన సరైనదని నిరూపించుకోవడానికి ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న పీపీఏను ఈఆర్సీ ఆమోదించలేదని లీకులిస్తున్నది. 'విద్యుత్తు చట్టం ప్రకారం పీపీఏకు, విద్యుత్తు అమ్మే రాష్ట్ర ఈఆర్సీ ఆమోదం తప్పనిసరి. ఈఆర్సీ ఆమోదం లేకుండా విద్యుత్తు కొనుగోలు జరగడం అనేది అసాధ్యం. పీపీఏను ఛత్తీస్‌గఢ్ ఈఆర్సీ ఆమోదం కోసం పంపినట్టు కమిషన్ చైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి స్వయంగా విలేకరుల సమావేశంలో చెప్పారు. ఇప్పుడే కాంగ్రెస్ ప్రభుత్వం ఈఆర్సీ ఆమోదం లేదంటున్నది. అడ్డదారి చెల్లింపులు అంటున్నది. అయినా ఒక ప్రభుత్వం, లేదా ప్రభుత్వ సంస్థ ఎక్కడైనా మరో ప్రభుత్వానికి, లేదా ప్రభుత్వ సంస్థకు వేల కోట్లను అడ్డదారిలో చెల్లించగలదా? అది సాధ్యమవుతుందా? అయినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి భాషలో లీకులిస్తే ఏమనుకోవాలి? ఈసర్కారు తీరు చూస్తుంటే ఖర్చు దండుగ కమిషన్ తక్షణ కర్తవ్యం గోచి దక్కితే చాలు' అన్నట్టు గాఉందని ఆయన ఎద్దేవా చేశారు. కేసీఆర్ లేఖతో జవాబు చెప్పలేని పరిస్థితిలో పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాగోలా బురదజల్లి తప్పించుకోవాలనే ప్రయత్నమే ఈ లీకులు అన్నట్టుగా ఉందని విమర్శించారు. 'సర్కారు వాదన నిజమైతే ఈ లీకులెందుకు? విచారణ కమిషన్ ద్వారా అధికారిక ప్రకటన విడుదల చేయవచ్చు కదా?' అని విద్యుత్తు రంగ నిపుణుడు ఒకరు ప్రశ్నించారు. ఈ ఉద్దేశపూర్వక లీకులతోనే ప్రభుత్వ వాదనలో పసలేదని అర్థమవుతున్నదని విశ్లేషించారు.

ఇదీ.. సర్కారీ లీకు..



- ఛత్తీస్‌గఢ్ విద్యుత్తుతో రూ.6 వేలకోట్లకు పైగా నష్టం
- ఛత్తీస్‌గఢ్ విద్యుత్తుతో తెలంగాణ విద్యుత్తు సంస్థలు అంచనాలకు మించి నష్టపోయాయి.
- ఒప్పందం ప్రకారం ఒక్క యూనిట్ ధర రూ.3.90 మాత్రమే అని చెబుతున్నప్పటికీ ఈ విద్యుత్తు కొనుగోలుతో రాష్ట్ర విద్యుత్తు సంస్థల నడ్డి విరిగినంత పనైంది.
- ఛత్తీస్‌గఢ్ నుంచి ఇప్పటివరకు మనం కొన్న విద్యుత్తు 17996 మిలియన్ యూనిట్లు. ఇప్పటివరకు చేసిన చెల్లింపులు రూ.7719 కోట్లు. ఛత్తీస్‌గఢ్‌కు చెల్లించాల్సిన బకాయిలు రూ.1081 కోట్లు. ట్రాన్స్ మిషన్ లైన్ చార్జీలు రూ.1362 కోట్లు. ఇవన్నీ లెక్కిస్తే ఒక్కో యూనిట్‌కు రూ.5.64 ఖర్చయింది. ఈ లెక్కన చెప్పుకొన్న రేటుకంటే వడ్డించిన చార్జీలతో దాదాపు రూ.3110 కోట్ల అదనపు భారం పడినట్టయింది.
- బకాయిల విషయంలోనూ రెండు రాష్ట్రాల మధ్య వివాదం ఇంకా తేలలేదు. కేవలం రూ.1081 కోట్ల బకాయిలున్నట్టు తెలంగాణ చెబుతోంది. రూ.1715 కోట్లు బకాయిలున్నట్టు ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు సంస్థలు లెక్క చూపుతున్నాయి. బకాయిల వివాదంపై ఛత్తీస్‌గఢ్ ఎలక్ట్రిసిటీ అప్పీలేట్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేసింది.
- ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు 2017 చివరి నుంచి అందుబాటులోకి వచ్చింది. ముందునుంచీ అరకొరగానే సరఫరా అయింది. ఎన్నడూ వెయ్యి మెగావాట్లు సాఫీగా రాలేదు. అక్కడి నుంచి ఆశించిన సరఫరా తగ్గిపోవటంతో తెలంగాణ డిస్కంలు బహిరంగ మార్కెట్లో విద్యుత్తు కొనుగోలు చేయాల్సి వచ్చింది. దీంతో 2017 నుంచి 2022 వరకు పడిన అదనపు భారం రూ.2083 కోట్లు. 2022 ఏప్రిల్ నుంచి ఈ విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.
- మరోవైపు ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తును తెచ్చుకునేందుకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (పీజీసీఐఎల్)తో 1000 మెగావాట్ల విద్యుత్తు సరఫరాకు కారిడార్ బుక్ చేసుకోవాల్సి వచ్చింది. ఈ కారిడార్ కూడా విద్యుత్తు సంస్థల కొంప ముంచింది. బుకింగ్ ఒప్పందం ప్రకారం విద్యుత్తు తెచ్చుకున్నా తెచ్చుకోకపోయినా పీజీసీఐఎల్‌కు సరఫరా చార్జీలు కట్టాల్సిందే. ఈ లెక్కన వాడకున్నా కట్టిన అదనపు చార్జీలు రూ.638 కోట్లు.
- దీనికి తోడు గత ప్రభుత్వ నిర్వాకంతో కారిడార్ల బుకింగ్‌తో అదనపు నష్టం వాటిల్లింది. కేవలం 1000 మెగావాట్ల కారిడార్ సరిపోతుండగా అనవసరంగా మరో 1000 మెగావాట్ల విద్యుత్తు సరఫరాకు అడ్వాన్స్‌గా కారిడార్ బుక్ చేసింది. ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు లభించే అవకాశం లేదని ఈ కారిడార్‌ను అర్థాంతరంగా రద్దు చేసుకుంది. ఈలోగా జరగాల్సిన నష్టం జరిగింది. పరిహారం కింద రూ.261 కోట్లు కట్టాలని పీజీసీఐఎల్ డిస్కంలకు నోటీసులు జారీ చేసింది. అవగాహన లేకుండా కారిడార్ ఒప్పందం చేసుకోవటంతో ఈ సమస్య తలెత్తింది.
- ఈ విద్యుత్తు కొనుగోలు ఒప్పందానికి ఇప్పటి వరకు తెలంగాణ ఈఆర్సీ ఆమోద ముద్ర వేయనే లేదు. ఈఆర్సీ ఆమోదం లేకుండా ఛత్తీస్‌గఢ్‌కు చెల్లించిన వేల కోట్ల రూపాయలన్నీ అడ్డదారి చెల్లింపులుగానే పరిగణించాలనే వాదనలు కూడా ఉన్నాయి.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	41.0°c	24.6°c
ఖమ్మం	40.0°c	24.0°c
ఆదిలాబాద్	39.8°c	25.2°c
మెదక్	39.5°c	22.7°c
రంగారెడ్డి	39.4°c	23.4°c
మహబూబ్‌నగర్	38.4°c	28.7°c
కరీంనగర్	37.0°c	27.0°c
వరంగల్	37.0°c	24.0°c
నిజామాబాద్	35.0°c	26.1°c
హైదరాబాద్	34.0°c	25.0°c

కరుణించిన వరుణుడు

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. హైదరాబాద్‌పై జోరు వాన కురిపించాడు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో కూడా సోమవారం వర్షాలు కురిశాయి. తెలంగాణపై ఉపరితల ఆవర్తన ద్రోణి ఏర్పడిందని, దీని ప్రభావంతో మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నది. రాయలసీమ నుంచి మధ్య బంగాళాఖాతం వరకు సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, నల్లగొండ, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. పలుచోట్ల పిడుగులు పడే అవకాశం ఉన్నదని, రైతులు, వ్యవసాయ కూలీలు చెట్ల కిందకు వెళ్లొద్దని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. సూర్యాపేట, వికారాబాద్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేశారు. సోమవారం మధ్యాహ్నం వరకు ఎండ, ఉక్కపోత హైదరాబాదీలను ఉక్కిరిబిక్కిరి చేయగా, ఆ తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్షం దంచి కొట్టింది. టోలిచౌకీ- గోల్కొండ ఎండీ లైన్స్‌లో ఈదురుగాలులకు 200 సంవత్సరాల నాటి చెట్టు నేలకొరిగింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి తలకు గాయాలు కాగా, 4 ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. భారీ వర్షం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

166 మండలాల్లో-60% వర్షపాతం

రాష్ట్రవ్యాప్తంగా సోమవారం సగటున 6.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. నిర్మల్ జిల్లాలో 18.8 మి.మీ, జయశంకర్ భూపాలపల్లిలో 17.1 మి.మీ, కుమ్రంభీం ఆసిఫాబాద్‌లో 14.6 మి.మీ, కామారెడ్డిలో 14.3 మి.మీ, హనుమకొండలో 12.3 మి.మీ, మెదక్‌లో 8.8 మి. మీ, ములుగులో 8.7 మి.మీ, మంచిర్యాలలో 4.5 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు వెల్లడించింది. జూన్ ఒకటి నుంచి 17వరకు ఏడు జిల్లాల పరిధిలోని 166 మండలాల్లో 60 శాతానికి పైగా వర్షపాతం నమోదైనట్టు ప్రకటించింది.

రాష్ట్రంలో 20 నుంచి వర్షాలు?:

కరీంనగర్, జూన్ 17 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో ఈ నెల 20 నుంచి వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని ఇండో-జర్మన్ శాస్త్రవేత్తల బృందం అంచనా వేసింది. గ్లోబల్ వార్మింగ్‌తో రుతుపవనాలు మారుతున్నాయని బృందం పేర్కొన్నది. పశ్చిమ తెలంగాణలో 20 నుంచి, తూర్పు తెలంగాణలో 21, ఉత్తర తెలంగాణలో 22 నుంచి ఏకధాటిగా వర్షాలుంటాయని తెలిపింది.

జూరాలకు కొనసాగుతున్న వరద

గద్వాల/అయిజ, జూన్ 17 : జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. సోమవారం 8,849 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 2,779 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.869 టీఎంసీలున్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు స్వల్ప వరద కొనసాగుతున్నది. 4,329 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 4,329 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో 1,850, అవుట్‌ఫ్లో 301 క్యూసెక్కులుగా నమోదైంది. టీబీ డ్యాంలో ప్రస్తుతం 6.070 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

రాష్ట్రంలో ఇక గనుల వేలం!

- నెలాఖరు వరకు కేంద్రం గడువు
- తొమ్మిదేండ్లు రాష్ట్ర ఖనిజ సంపదను కాపాడిన కేసీఆర్

హైదరాబాద్, జూన్ 17(నమస్తే తెలంగాణ): గత కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేండ్లపాటు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన ఖనిజ సంపదను వేలం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరోసారి పావులు కదుపుతున్నది. ఈ నెల 30వ తేదీలోగా రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయకుంటే తామే వేలం వేస్తామంటూ కేంద్రం స్పష్టం చేసింది. తాము ఇప్పటికే నిర్దేశించిన 11 బ్లాకుల్లో కనీసం ఆరింటినైనా వేలం వేయాలని కేంద్రం ఒత్తిడి తెస్తున్నది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొని వేలం ప్రక్రియను చేపట్టేందుకు గనుల శాఖ సిద్ధమవుతున్నది. వివిధ ఖనిజాలకు సంబంధించి 11 బ్లాకులను వేలం వేయాలని కేంద్రం అనేకమార్లు ఒత్తిడి తెచ్చినప్పటికీ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం తలొగ్గలేదు. రాష్ట్రంలోని అత్యంత విలువైన ఖనిజ సంపదను కాపాడి, భవిష్యత్తు తరాలకు అందించాలన్న మహోన్నత లక్ష్యంతో ఇందుకు ఒప్పుకోలేదు. వాస్తవానికి దేశంలో వేలం ద్వారా గనుల కేటాయింపు ప్రక్రియ 2015 నుంచి ప్రారంభమైంది. నూతన మైనింగ్ నిబంధనలు అమలులోకి వచ్చినప్పటి నుంచి కేంద్రం దేశవ్యాప్తంగా 354 బ్లాకులకు వేలం నిర్వహించగా, ఇందులో 48 మినరల్ బ్లాక్‌ల్లో ఉత్పత్తి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోని 11 బ్లాక్‌లను వేలం వేయాలని గత తొమ్మిదేండ్లుగా కేంద్రం ఒత్తిడి తెస్తున్నప్పటికీ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో ఈ 11 బ్లాకుల్లో కనీసం ఆరు బ్లాకులను ఈ నెలాఖరులోగా వేలం వేయాలని, లేనిపక్షంలో తామే వేలం ప్రక్రియను చేపడతామని తాజాగా తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం లేఖ రాసింది. తాము అనేకసార్లు కోరినప్పటికీ గడచిన తొమ్మిదేండ్లలో తెలంగాణ ప్రభుత్వం ఒక్క బ్లాక్‌ను కూడా వేలం వేయలేదని ఆ లేఖలో పేర్కొన్నది. తెలంగాణలోని ఐదు ఇనుప, ఐదు సున్నపురాయి, ఒక మాంగనీసు గని బ్లాకులను వేలం వేయాలని కేంద్రం కోరుతున్నది.

9 ఏండ్ల కష్టం.. ఫాక్స్‌కాన్

మొదటిపేజీ తరువాయి...

ప్రారంభించనున్నది. ఈ ప్లాంట్‌తో మొదటి దశలో 25,000 మందికి ఉద్యోగావకాశాలతో ప్రారంభమై మొత్తంగా లక్ష మందికి పైగా ఉపాధి లభించే అవకాశం ఉన్నది. స్వతంత్ర భారత దేశ చరిత్రలోనే ఇది రికార్డు. అయితే, ఈ కంపెనీ అంత ఆషామాషీగా ఏమీ తెలంగాణకు రాలేదు. రాత్రికి రాత్రే జరిగిన అద్భుతమేమీ కాదు. దీని వెనుక తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి పరిశ్రమల మంత్రి కేటీఆర్ తొమ్మిదేండ్ల కృషి ఉన్నది. అప్పటి బీఆర్ఎస్ ప్ర భుత్వం తీసుకొచ్చిన పారదర్శక విధానాలు, టీఎస్ఐపాస్ వంటి విప్లవాత్మక మార్పులతోనే ఇది సాధ్యమైంది.

తరలించుకుపోయే కుట్రలు

అది 2015 సంవత్సరం. తెలంగాణ యువతకు పెద్దసంఖ్యలో ఉద్యోగాలు కల్పించాలని కేసీఆర్, కేటీఆర్ నిర్ణయించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల దిగ్గజం ఫాక్స్‌కాన్ గురించి తెలుసుకొని.. ఏదేమైనా ఆ కంపెనీ ప్లాంట్‌ను రాష్ట్రానికి రప్పించాలనుకొన్నారు. అనుకొన్నదే తడవుగా 2015 జనవరి 11న తొలిసారి ఫాక్స్‌కాన్ కంపెనీ ప్రతినిధులతో కేటీఆర్ భేటీ అయ్యారు. కంపెనీ స్థాపనకు తెలంగాణ సర్కారు ఇస్తున్న ప్రాధాన్యతను, హైదరాబాద్‌లో ఉన్న ప్రత్యేకతలను వివరించారు. అదే ఏడాది ఫాక్స్‌కాన్ ప్రతినిధులు హైదరాబాద్‌కు వచ్చేలా చేశారు. ఇది పసిగట్టిన కేంద్రంలోని కొందరు పెద్దలు కంపెనీని మహారాష్ట్రకు తరలించుకుపోయే కుట్రకు తెరతీశారు. ఇది గమనించిన కేసీఆర్, కేటీఆర్ కంపెనీ అత్యున్నత ఉద్యోగులతో వీడియో సమావేశాలు నిర్వహించారు. కంపెనీ ప్రధాన కార్యాలయం ఉన్న తైవాన్‌కు అప్పటి రాష్ట్ర ప్రభుత్వంలోని కీలక ప్రతినిధులు మూడు సార్లు వెళ్లొచ్చారు. కంపెనీ ప్రతినిధులతో పదుల సంఖ్యలో కేటీఆర్ చర్చలు జరిపారు. టీఎస్ఐపాస్, రాష్ట్రంలోని స్నేహపూర్వక వాతావరణం, మానవ వనరులు, రవాణా సదుపాయాలు ఇలా అన్నింటినీ లోతుగా వివరించారు. దీంతో తెలంగాణలోనే పెట్టుబడి పెట్టేందుకు ఫాక్స్‌కాన్ సుముఖత వ్యక్తం చేసింది. అలా నిరుడు మార్చిలో అప్పటి సీఎం కేసీఆర్‌తో సమావేశమైన అనంతరం సంస్థ చైర్మన్ యంగ్ లియు తెలంగాణలో ప్లాంట్ ఏర్పాటును ఫైనల్ చేశారు. కంపెనీ ప్రతినిధులు కోరిన విధంగానే వెనువెంటనే అప్పటి ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో 196 ఎకరాల భూమి కేటాయించగా, మేలో అప్పటి పరిశ్రమల మంత్రి కేటీఆర్ సంస్థకు శంకుస్థాపన చేశారు. వచ్చే ఆగస్టులో ఫాక్స్‌కాన్ ఉత్పత్తులు ప్రారంభం కానున్నాయి.

ఐఫోన్‌కు 70 శాతం ఉత్పత్తుల సరఫరా

హోన్ హై టెక్నాలజీ గ్రూప్ (ఫాక్స్‌కాన్) ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యాపిల్ ఐఫోన్‌కు సుమారు 70 శాతం ఉత్పత్తులను సరఫరా చేస్తున్నది ఈ కంపెనీనే.

ఫాక్స్‌కాన్‌తో మనకేంటి?

తొలి దఫాలో తెలంగాణలో పెట్టుబడి **4,595 కోట్లు**

తొలి దఫాలో తెలంగాణ యువతకు ఉద్యోగాలు **25000**

మొత్తంగా తెలంగాణ యువతకు రానున్న ఉద్యోగాలు: లక్షకు పైనే

ఫోన్లతోపాటు ఐపాడ్‌లు, వైర్‌లెస్ ఇయర్‌ఫోన్స్, చార్జర్లు తదితర వాటిని కూడా తయారు చేస్తున్నది.

ఫాక్స్‌కాన్ కస్టమర్లు

యాపిల్, గూగుల్, జియోమీ, అమెజాన్, హ్యూలెట్ ప్యాకర్డ్, హ్యూవాయ్, సిస్కో, నెన్‌టెండో, సెగా అలీబాబా గ్రూప్, డెల్, ఫేస్‌బుక్, సోనీ, మైక్రోసాఫ్ట్, నోకియా తదితర దిగ్గజ కంపెనీలు.

ఫాక్స్‌కాన్ కార్యకలాపాలు ఏయే దేశాల్లో

చైనా, వియత్నాం, థాయిలాండ్, మలేషియా, అమెరికా, యూరప్, భారత్ సహా 24 దేశాల్లో ఫాక్స్‌కాన్ సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తున్నది.

నామినేటెడ్ పోస్టుల్లో ప్రతిష్ఠంభన

- అనర్హులకు ఇచ్చారని ఫిర్యాదులు
- పనితీరు బట్టి ఇవ్వాలన్న అధిష్ఠానం
- ప్రకటించిన జాబితాలో మార్పులు
- తాను గ్రీన్ సిగ్నల్ ఇచ్చాకే జీవోలు ఇవ్వాలంటూ దీపాదాస్ మెలిక

హైదరాబాద్, జూన్ 17 (నమస్తే తెలంగాణ): నామినేటెడ్ పోస్టుల భర్తీలో ప్రతిష్ఠంభన కొనసాగుతున్నది. ఇప్పటికే ప్రకటించిన పోస్టులకు జీవోలు జారీ చేయవద్దన్న అధిష్ఠానం ఆదేశంతోనే తదుపరి ప్రక్రియ నిలిచిపోయినట్టు పార్టీ అత్యున్నత వర్గాల సమాచారం. తన నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చే వరకు నియామకాలపై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయవద్దని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ ఆదేశించినట్టు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన మేరకు ఫలితాలు సాధించకపోవడంతో నామినేటెడ్ పోస్టుల భర్తీని పునస్సమీక్షించాలని అధిష్ఠానం నిర్ణయించినట్టు సమాచారం. సీనియార్టీ ప్రాతిపదికన కాకుండా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పనితీరు ఆధారంగా పోస్టులను భర్తీ చేయాలని పార్టీ పెద్దలు యోచిస్తున్నట్టు తెలిసింది.

ఒకే దఫాలో 37 మందికి పోస్టులు

లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ఒకే దఫాలో 37 మందికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చినట్టు మార్చి 15న పీసీసీ అనధికారికంగా ప్రకటించింది. ఆ జాబితాలో ఉన్న నేతలు కొందరు పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు కూడా తెలిపారు. ఆ మరుసటి రోజు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో కోడ్ ముగిసిన తర్వాత వీటికి సంబంధించిన జీవోలు జారీ అవుతాయని రేవంత్‌రెడ్డి స్వయంగా వెల్లడించారు. తమతో చర్చించకుండానే నామినేటెడ్ పోస్టులు ప్రకటించారని మంత్రులు, ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు కొందరు అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ఆధారంగా వీటిలో మార్పుచేర్పులు ఉంటాయని అధిష్ఠానం అప్పుడు వారికి హామీ ఇచ్చింది.

గుర్రుగా మంత్రులు

తనతో చర్చించకుండానే శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నరేందర్‌రెడ్డిని నియమించారని కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు, ఆయన వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ఇనుగాల వెంకట్‌రామిరెడ్డిని నియమించడంపై మంత్రి కొండా సురేఖ కూడా సీఎం రేవంత్ వద్ద అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి విజయానికి కృషి చేసిన తనకు ఎమ్మెల్సీ పదవి ఇస్తామని చెప్పి, ఇప్పుడు ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇస్తామనడంపై జగదీశ్వర్‌రావు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. తనకు ప్రాధాన్యంలేని ఆయిల్ సీడ్ ఫెడరేషన్ చైర్మన్ పదవి వద్దని వరంగల్ జిల్లాకు చెందిన జంగా రాఘవరెడ్డి కూడా అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి కూడా తనకు ఇవ్వనున్నట్టు ప్రకటించిన పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి పట్ల అసంతృప్తి వ్యక్తం చేసినట్టు పార్టీ వర్గాల సమాచారం.

తిరగబడిన వ్యూహం

ఎన్నికలకు ముందు నామినేటెడ్ పోస్టులు ఇవ్వడం వల్ల మంచి ఫలితాలు వస్తాయని రేవంత్‌రెడ్డి భావించారని ఆయన సన్నిహితులు అప్పట్లో అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ ఈ వ్యూహం ఫలించలేదు. ఎలాగూ పోస్టులు దక్కడంతో కొందరు నేతలు మొక్కుబడిగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని, ఈ కారణంగా కచ్చితంగా గెలిచే సీట్లను కూడా కోల్పోవాల్సి వచ్చిందని పార్టీ అంతర్గత సర్వేలో తేలిందని చెప్తున్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డిని అనర్హులకు నామినేటెడ్ పోస్టుల ఫిర్యాదుపై అధిష్ఠానం ఆరా తీసినట్టు తెలిసింది. ఇప్పటికే ప్రకటించిన పోస్టులతో పాటు ప్రకటించాల్సిన వాటిపై మళ్లీ కసరత్తు చేసి తమ ఆమోదానికి పంపించాల్సిందిగా ఆదేశించినట్టు సమాచారం. నామినేటెడ్ పోస్టుల భర్తీకి సంబంధించి రెండుమూడ్రోజులుగా రేవంత్‌రెడ్డి, దీపాదాస్ మున్షీ కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది.